

# తెరచిన తలుపులు

## పైడిపాటి సుబ్బరామశాస్త్రి

**వా**ల్తేరులో ఎక్స్‌ప్రెస్ ట్రెయిను బయలుదేరబోతూ ఉండగా, ఒక నడి వయస్సు జవ్వని తలుపు తెరచుకుని ఫస్టు క్లాసు కంపార్టుమెంటులో ప్రవేశించింది. అంతకుముందు ఆ పెట్టెలో కైలాసం ఒక్కడే కూర్చుని ఉన్నాడు. అతనికామె నమస్కరించి, తాకు కొన్న సంచికలు సీటులో ప్రక్కగా పెట్టుకుని ఒక్కొక్కటీ చదవాలని అనుకుంటూ ఉండగా రైలు కదిలింది. ఆ కంపార్టుమెంటులో వీరిద్దరే ప్రయాణికులు.

ఆమె కొకచేతికి రిస్టువాచీ, రెండవ చేతికి గాజులూ ఉన్నై. ముఖాన బొట్టూ, మెళ్లో మంగళసూత్రం ఉన్నట్టులేదు. నిట్టూర్చి క్రిందకుచూస్తే ఆమె పెట్టె మీద శ్రీమతి రాజ్యం, బి.ఎ.బి.యి.డి.

అరండేలుపేట, గుంటూరు అనే అక్షరాలున్నై. తానుండే బ్రాడీ పేటకూ, అరండేలుపేటకూ రోడ్డే అడ్డం.

కైలాసం స్ఫురద్రూపి. ఖద్దరులాల్చీ ధరించి, కుంకుమబొట్టు పెట్టి, లేతరంగు ఖద్దరు శాలువా వల్లెవాటుగా వేసుకుని నడుస్తూఉంటే, అసలే కసరత్తు చేసిన శరీరమేమో, ఒక మదగజం నడిచినట్లుండేది. దానికితోడు కళ్ళకు కాటుక పెట్టి, బంగారు గొలుసు మెడలో వేసుకుని విలక్షణంగా కనబడేవాడు. ఆంధ్రంలో రచనలు చేశాడు. సంస్కృతం, ప్రాకృతం, బెంగాలీ మొదలైన భాషలు వచ్చు. స్త్రీలపట్ల అతిమాత్రమైన మర్యాద చూపించడం కూడా ఒక విద్యగా అభ్యసించినవాడు.

''మేడమ్ ! తమరుకూడా గుంటూరు దాకా ప్రయాణం చేస్తున్నారా ?"

ఔనన్నట్లుగా తల ఊపింది రాజ్యం.

"మిమ్మల్ని ఎక్కడో చూచినట్లుగా ఉంది. గుంటూరులోనేనా ? లేక-"

''ఊ ! లేక !''

''పూర్వజన్మలోనా? ఒక్కొక్కప్పుడు జన్మాంతర స్మృతులుకూడా సంభవమని గ్రంథాలు వక్కాణిస్తున్నవి."

రాజ్యం విశదంగా నవ్వింది. ఆ నవ్వు కైలాసంప్రాణాలనే లాక్కున్నట్లుగా ఉంది.

"ఈ జన్మలోనే, గుంటూరులోనే. తమ సాహిత్యసభలకు నేను వస్తూఉంటాను."

ఇంతటి అందకత్తెలు కూడా తన సభలకు వస్తారన్నమాట!" అని అనుకుని కైలాసం ఉప్పొంగిపోయాడు.

"మేడమ్ ! ఎందరెందరో వనితామణులు వస్తూ ఉంటారు. వారియందు ప్రీతిచేత అక్కడికి ఒక కంట వారిని గమనిస్తూనే ఉంటాను. తమరిని గమనించలేకపోయాను. క్షంతవ్యుణ్ణి."

రాజ్యం సిగ్గుపడింది. ఆ అందాన్ని మనస్సులో మూటకట్టుకున్నాడు కైలాసం. కాని వెంటనే ఆ ముఖారవిందం ముకుళించుకుపోయింది.

"నేను తెంపరినికాదు. నా ముఖం చూపించకుండా ఒదిగి ఏ మూలో కూర్చుని వెళ్ళిపోయేదాన్ని. తమరు గమనించడానికే అవకాశంలేదు."

"భగవంతుడు చేసినదానికి మనమేం చేయగలం ?" అన్నాడు గద్గద స్వరంతో.

"పురుషపుంగవులయి కూడా మీరూ అల్లాగే ఉండిపోయారు!"అన్నది రాజ్యం నిట్టూరుస్తూ. కైలాసానికి నడివయస్సులో భార్యావియోగం కలిగింది."

మీ దురదృష్టాన్ని మీరు సహిస్తూ, నా దురదృష్టానికి విచారించే మీది ఎంతటి ఆర్ద్రహృదయం !" అని అంటూ ఎదురుగా ఉన్న ఆమెసీటులో ప్రక్కగా కూర్చున్నాడు మధ్యగా ఉన్న ఒక పత్రికను తెరుస్తూ.

"ఇంతకీ మీకీ దురవస్థ వచ్చింది కొంతకాలం గడచిన తర్వాతనా? లేక-"

"పెళ్ళిలో ఒక్కసారే వారిని చూశాను. అంతే! మహారాజు! తిండికి లోటులేకుండా బ్రతకమని ఆస్థి ఇచ్చి పోయారు. అంతే ప్రాప్తి! తర్వాత చదువుకొని, కాలక్షేపంకోసం, హైస్కూలు హెడ్‌మిస్ట్రెస్‌గా పనిచేస్తున్నాను. అమ్మా నాన్నలదగ్గ రే నివాసం. వీణ నేర్చుకున్నాను. కృతులు పాడుకుంటాను. దేవాలయాలకూ సాహిత్య సభలకూ వెడుతూఉంటాను."

"అరండేలుపేటలో ఎక్కడ మీరుండేది?"

"మెయిన్‌రోడ్డు అవతల మీది ఎడమ ప్రక్క అయిదవఇల్లు.'' మెయిన్‌రోడ్డు ఇవతల మాదీ ఎడమప్రక్క అయిదవఇల్లే.

"అయితే మెయిన్‌రోడ్డు మధ్యగా లేకపోతే పేటలతేడాలు లేకపోతే మనిద్దరిదీ ఒకటే లైను. ఎంత దగ్గర! ఎంత దగ్గర!"

"మీరు మా వీధిలోనుండి వెడుతూ ఉంటే చూసి, మీరు తిరిగి వివాహం చేసుకోనందుకు బాధపడుతూ ఉంటాను."

"మేడమ్! బాధా స్వరూపం మీదీ నాదీ ఒకటే."

"వివాహం చేసుకోవడం మానివేసినట్లేనా?"

"చెప్పలేను."

"భార్యను కొంతకాలంవరకూ మరచిపోవడం కష్టం."

"మేడమ్! ఆమెయందు నా కనురాగంలేదు. పెద్దలుచేసిన పెళ్ళి కనుక లోకవ్యవహారం చేశాను- అంతే! ఆమె గతించిన తర్వాత ఇద్దరుపిల్లలూ మాతామహుడి దగ్గర పెరుగుతున్నారు. నేను సత్రంభోజనం, మఠంనిద్రగా కాలక్షేపం చేస్తున్నాను.''

"మళ్ళీ పెళ్ళిలేకుండా కాలం వృధా చేసుకోవడం మంచిదికాదేమో!"

"కాదనీ అనిపిస్తూ ఉంటుంది. పెళ్ళి సంగతి అల్లా ఉంచండి. నాకొక వ్యక్తి మీద అనురాగం కలిగింది. కాని ఆమె సంగతి మాత్రం నాకు తెలియదు."

"ఆమె ఎవరో తెలుసుకోవచ్చునా?"

"నిరాక్షేపణగా మీదగ్గర దాపరికం దేనికి?"

"ఎవరు?"

"మీరే."

రాజ్యం ఉలికిపడింది. సిగ్గుతో క్రుంగిపోయి తల వాల్చివేసింది. చెక్కిళ్లు ఎఱ్ఱబడినై. హృదయం తీవ్రంగా స్పందిస్తోంది. తానా ప్రశ్నను వేసినందుకు పస్తాయించింది. అతని యందు తనకు గౌరవాభిమానాలు మాత్రమే ఉన్నవి. అతని జవాబు భిన్నంగా ఉంది.

రంగులు మారుతున్న ఆమె ముఖాన్ని చూసి కైలాసం చల్లగా తన చోటులోకి వెళ్ళిపోయాడు. అది ఆమెకు యెంతో సుఖమనిపించింది. తనవంక దీనంగా చూసే అతనివంక చూడకుండా ఆమె రాబోయే సామర్లకోట స్టేషన్‌వంక

చూస్తోంది. కైలాసం రెండుకప్పుల కాఫీకి ఆర్డరిచ్చి, ఒకకప్పు సవినయంగా రాజ్యానికందించాడు. ఆ స్టేషన్‌లోకూడా ఎవ్వరూ ఎక్కలేదు. రైలు కదిలింది. ప్రయాణం ప్రారంభంనుండీ చదువుతున్నప్పుడు చదువుకుంటూ, మాట్లాడినప్పుడు మాట్లాడుతూ కాలక్షేపం చేస్తూ వస్తున్నారు.

''కైలాసంగారూ :'' అంది రాజ్యం, గంభీరంగా.

ఉలికిపడి చూశాడు కైలాసం.

"రాగం అనేది క్రమక్రమంగా కలుగుతుందా ? లేక హఠాత్తుగా కలుగుతుందా? ఏది చిరకాలం ఉంటుంది ?"

"దానికి క్రమపరిణామం, కాలపరిపక్వం అవసరం. అందుచేత నూటికి తొంబదిపాళ్లు హఠాత్తుగా కలుగదు. ఒక పాలు కలుగవచ్చు. ఆ కలిగింది పూర్వజన్మ సంబంధి అయితే చిరకాలం నిలిచే అవకాశం ఉన్నది,'' అని తడుముకోకుండా సమాధానం చెప్పాడు.

"విధవావివాహం శాస్త్ర సమ్మతమనే అంటారా ?''

"మేడమ్ ! ఇట్లాంటి తికమక ప్రశ్నలు అస్మదాదులను వేయకూడదు. అవునన్నవాళ్లూ ఉన్నారు, కాదన్నవాళ్లూ ఉన్నారు. చేసుకునేవాళ్లు చేసుకుంటున్నారు, చట్టం సమ్మతిస్తోంది. ఇక నేననడం విషయం, శాస్త్రకారులు దానినంగీకరించినట్లు నాకనిపించలేదు.

"అయితే మీరు వితంతు వివాహం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారా? ఇతరుల అనురాగం విషయం అలా ఉంచి సమాధానం చెప్పండి.''

"నేను సిద్ధంగా లేను. అందుచేతనే పెళ్ళిసంగతి అలా ఉంచమన్నాను. నాకనురాగం ఉన్నదని వెల్లడించానంతే!''

"మీరు విచిత్రమయిన జీవులు. మీకు శాస్త్రాలమీద ప్రమాణబుద్ధి ఉంది. ఆధునిక నాగరకతా ప్రభావమూ మీమీద ఉన్నది. అనుభవము మాత్రం కావాలి."

"అనుభవాన్ని కూడా నేను కోరడం లేదు.''


''మరి !'' అని ఆశ్చర్యంతో అతని వంక చూసింది.

"నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను. మీరు కూడా నన్ను ప్రేమిస్తే ధన్యుణ్ణి. నేను సౌందర్యాన్ని ఉపాసింపదలచాను."

"అయితే మీది వట్టి మానసిక దౌర్బల్యం !"

"నేను దుర్బలుణ్ణే. మీరు నిజంగానే అన్నారు." అని బిక్కమొహం పెట్టి కన్నీరు కార్చాడు. ఆమె హృదయాన్ని ద్రవింపచేసి తనకు అభిముఖురాలుగా చేసుకోవాలనే ప్రయత్నం కూడా ఆ కన్నీరు కార్చడంలో ఉన్నది.

సాహసంగా తన అభిప్రాయాన్ని వెల్లడించి, తాను పెద్దగా అతనిని దూషించకపోయినా దుఃఖించేపురుషుణ్ణి




ఆ మె ఊహించుకోలేకపోయింది. ఉపేక్ష వహిస్తే సరిపోయేదానికి, తానాతనిని నొప్పించాననే బాధ కలిగి, మాట మార్చాలని అనుకుని కూడా,

"మీరు కలిగినదనే అనురాగం దృఢ మైనదనే దానికి దృష్టాంతం ఏమిటి ?" అని నిగ్గతీసినట్లుగా అడిగింది, అల్లా అడిగితే అతడు తగ్గిపోతాడనీ, ఇక అలాంటి ప్రస్తావన చేయడనీ ఆమె అభి ప్రాయం.

"రైలు గోదావరి స్టేషన్ దాటిన తర్వాత చూపిస్తాను." రాజ్యం కళవళ పడింది.

కైలాసం లేచి "మేడమ్! నీ మీద వలపుకు దృష్టాంతంగా అఖండగోదా వరిలో దూకబోతున్నాను. వచ్చేజన్మలో కలిసికొందాం" అని అడుగువేయబో యాడు.

రాజ్యం చివాలున లేచి తలుపు కడ్డంగా నిలబడి ఖంగారుగా "మీకే మయినా మతిభ్రం కలుగలేదు కదా!" అంది.

"కాదు, పిచ్చివాణ్ణి కాదు. మీ అందం నన్ను పిచ్చివాణ్ణి చేసింది. అసలు నా జీవితంలో తలుపులను ఎందుకు తెరిచారు మేడమ్ ? అడ్డం లేవండి. నా ప్రేమనే సంశయించిన తర్వాత నేను జీవించడం వృధా."

నిజంగా ఈ పిచ్చివాడు చచ్చిపోతా డేమోనని భయపడి "సంశయం లేదు" అని అప్రయత్నంగానే అనేసింది. ఆమె కంటను కూడా నీరు కారుతోంది.

"నేను పురుషుణ్ణి కనుక ప్రేమ వెల్లడించాను మేడమ్! నీవు స్త్రీవి నీవు వెల్లడించలేవు. నీకు నాపైగల ప్రేమకు నీ కన్నీళ్లే దృష్టాంతం. నేను

చస్తే నీవు బ్రతకలేవు కనుక ఆత్మ హత్యా ప్రయత్నాన్ని విరమించు కున్నాను. నీవు సంశయం లేదన్నావు కనుక విరమించుకున్నాను," అని తన సీటులోకి వెళ్ళి బుద్ధిమంతు డల్లే కూర్చున్నాడు. "బ్రతుకు జీవుడా!" అని తన సీటులోకి తాను వెళ్లి యీ తవ్వాయి తప్పినందుకు సంతోషిస్తూ, అతనితో వ్యవహరించే పద్ధతిని కచ్చితంగా మార్చుకోవాలని అనుకుంది, రాజ్యం.

"ప్రేమకోసం సింహాసనాలను పరి త్యజించినవారూ, ఎడారి తుపానులకు ఆహుతి అయినవారూ వున్నారు." అనుకుంటున్న కైలాసంమీదికి రాజ్యం తన జేబురుమాలను విసరి కన్నీరు తుడుచుకోమన్నది. తుడుచు కుని, "ఈ జేబురుమాల నా దగ్గర వుంచుకోవచ్చునా ?" అని అంటే "ఉంచుకోవచ్చు, ప్రేమ చిహ్నంగా మాత్రంకాదు" అని అంది.

"మీరు అల్లాగే అంటారులే మేడమ్ ! పాశ్చాత్యదేశాలలో ప్రేమఘట్టాలలో జేబురుమాలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. మనది మన దేశంగా."

"కైలాసంగారూ ! పెళ్లితోనూ, అనుభవముతోనూ, నిమిత్తంలేకుండా, ప్రేమ ఉండవచ్చునని మీ అభిప్రాయ మైనట్లు కన్పిస్తోంది. నేను మిమ్మల్ని సరిగా అర్థంచేసుకున్నట్లేనా ?"

"అదే నే చెప్పేది – ప్రాణేశ్వరీ ! ముక్కూ మొహం ఎరుగనివాళ్ళు కూడా, ఫొటోలు పంపుకుని, లేఖలు వ్రాసుకుని ప్రేమించుకుంటారు. దానిని పెళ్లి అని అన్నా అనకపోయినా నష్టంలేదు–వా రా జన్మలో కలియకపోయినా వారు ప్రేమి కులే. ఒకరికోసం ఒకరు తపిస్తారు. అదే అమలిన శృంగారం.''

'చచ్చాం రా భగవంతుడా ! ఈ గొడవంతా ఇందుకనా ? అని మనసులో అనుకుని, "రస సిద్ధికి మన గ్రంథాలలో సంభోగ శృంగారాన్నే చెప్పినట్లు కన్పిస్తుందే. శాకుంతలంలోని శృంగారాన్ని తమరు మలిన శృంగారంగానే భావిస్తారా ?" అని ప్రశ్నించింది.

"మేడమ్ ! అల్లా నే ననగలనా ? కాని అస్మదాదులం ఇల్లాంటి సాధన చేస్తున్నాం. ఈ పొడి వలపువల్ల మనస్సు తడియై, ఉత్తేజం పొంది, ఏనుగంతబలం సంతరించుకుంటుంది."

"వట్టి ఏనుగుకాదు. మదగజం అంత !" అని రాజ్యం నవ్విన తీరు కైలాసాన్ని చక్కిలిగింత పెట్టింది.

"చూశారా ! మీరు నవ్వితే నేనెంత ఉత్తేజం పొందానో ?"

"చూడలేదు కాని, భర్త కాని భర్త, భార్య కాని భార్యయందు రక్తిని పెంచు కొనడం మానసిక వ్యభిచారం అవుతుందేమో !"

కైలాసం ముఖం వివర్ణమైంది. నిట్టూర్చి "నిజం" అన్నాడు.

"కైలాసంగారూ !"

"గారూ అనవద్దు. మనం ఆత్మీయులం."

"ఒక పరాయిస్త్రీని ప్రేయసి అని అనుకుని వుత్తేజం పొందానని అనుకోవడంకంటే, జీవుడు తనయందు స్త్రీత్వాన్ని ఆరోపించుకుని, పరమ పురుషుణ్ణి, గోపికలవలె భావించవచ్చు కదా !"

"ఆ సాధనకు తొలిమెట్టుగానే ఈ సాధన చేస్తున్నాం" అనేశాడు తడుముకోకుండా.

'ఇక అతనిని మంచిమార్గంలో పెట్టడం సాధ్యంకా'దని అనుకుంది.

"ఒట్టుపెట్టినట్లు ఇవాళ ఎవరూ ఈ పెట్టెలో ఎక్కలేదు" అన్నది మాట మార్చి.

"ఈశ్వర సంకల్పమంటేనే అది, ప్రాణేశ్వరీ ! ఎవరయినా ఎక్కి వుంటే ఇంత స్వేచ్ఛగా మన తలపులు తెరుచుకోగలిగి వుండేవారమా ?"

"వుత్తేజం పొంది మీరు చేసేదేమిటి ?"

"చేవగల కవిత్వం వ్రాస్తాను."

"ఎవరిమీద ?"

"నీ మీదే."

"పేరుపెట్టికూడా వ్రాస్తారా ?"

"నేనంత వెర్రివాడనా ?"

"అంత కాదనుకోండి."

"ప్రాణేశ్వరీ ! నీవు నా కారాధ్యవు" అని ఆమె ముందు మోకరిల్లాడు.

"తప్పు ! లేవండి !"

లేచి "మేము ప్రేయసిని దేవతగా కూడా భావిస్తాము" అంటూ తిరిగి ఆమె ప్రక్కకూర్చొని "ఈ పుస్తకంమీద జాకెట్ ఎంత సుందరంగా వుంది ! మీద చేయివేస్తే, నున్నగా, ప్రియురాలి భుజంమీద చేయి వేసినట్లుగా వుంది" అని దానిని తెరచి అందులో పెట్టబడిన ఆమె ఫొటో తీసుకుని వెంటనే తన సీటులోకి వెళ్లిపోయాడు.

'ఈ వెర్రి ఇల్లా వెళ్లిపోవలసిందే' అనుకుని నిశ్చేష్టురాలై రాజ్యం చూస్తోంది.

"ఈ ఫొటో నా దగ్గర వుంచుకుంటాను," అని దానిని హృదయానికి హత్తుకుని, తన దగ్గర ఎర్రసిరా కలంతో నుదుటను బొట్టుపెట్టి రాజ్యానికి చూపించాడు. రాజ్యం సహించలేక ముఖం త్రిప్పివేసింది.

"దీని నందరకూ చూపి నా ప్రాణేశ్వరి అని టమటమా వేస్తారా ?" అని మాత్రం అంది.

"గుప్తంగా వుంచుకుని దినదినమూ చూసుకుంటాను. నా జీవితంలో ఒక వెలితి పూరింపబడింది. క్రొత్త క్రొత్త అనుభూతులు నాలో కలుగుతున్నై. నీవు నా ప్రేయసివనే భావనతో

నిండుగా బ్రదుకగలను. ఈ రోజుతో బైరాగి జీవితానికి స్వస్తి. నేను పిచ్చి వాణ్ణి మాత్రంకాదు. నీవు నా వివాహాన్ని గూర్చి బాధపడినప్పుడు, జేబురుమాల విసరివేసినప్పుడు, కన్నీళ్ళు పెట్టు కున్నప్పుడు, నాపై నీకు వున్నది జాలి అని నీవు భ్రాంతిపడవచ్చు. కాని అది నిగూఢమైన ప్రేమ, ప్రాణేశ్వరీ! నిన్ను చూస్తూ నేను బ్రదుకగలను. మనకు పూర్వజన్మానుబంధం వున్నది ప్రేయసీ !"

"ఎవరి పిచ్చి వారి కానందం. మీరు మనస్సులో ఏమని అనుకున్నా, అల్లా అనుకోకుండా చేయలేను కదా! మిమ్మల్ని మార్చడం నా తరం కాదని తేలి పోయింది. మీరు మా యింటికి ఎప్పుడూ రారాదు. నేను రానేరాను. పిచ్చి జాబు లేమీ నాకు వ్రాయడంకాని, నే నెక్క డయినా కన్పిస్తే వెకిలిగా ప్రవర్తిం చడంకాని చేయరాదు.''

"నీ ఆంక్షలన్నీ పాటిస్తాను ప్రాణే శ్వరీ ! నీవు ప్రాణేశ్వరివయిన తర్వాత నా ప్రాణమే నీదికదా !" అంటూ చేతులు జోడించాడు.

"కాని ఒక్క అభ్యర్థన. భావనకు ఉపకరించినా నీ ఫొటో నిర్జీవపదార్థమే. రోజుకొకసారి అయినా నిన్ను చూడనిది నేను బ్రదుకలేను. సాయంత్రం ఆరు గంటలకు ప్రతిరోజూ మీ మేడమీద ఒక్క అయిదు నిమిషాలు దర్శనమిస్తే, నేను వాహ్యాళికి వెళ్లేటప్పుడు చూసి ఉత్తేజపడతాను. ఊళ్లోవుంటే పిడుగులు పడినా వస్తాను. రానిరోజు నేను ఊళ్లో లేనిరోజు. నీ విషయంలో అయినా అంతే."

రాజ్యం సందేహించింది.

"ఏమిటి సందేహిస్తున్నారు? చిత్ర కారుడి ముందు స్త్రీ తన వంపులు, సొంపులన్నీ చూపిస్తూ కళకోసం నిల బడుతుంది. అది కళగా బజారు కెక్కు తుంది. ఇది అంత తీవ్రమయినదికాదు. మీ వరకూ నా వరకే పరిమితం."

రాజ్యం నిట్టూర్చింది. తన షరతులు శిరసావహించినందుకు కొంత తృప్తి పడింది. ఇంతలో విజయవాడ స్టేషన్ వచ్చింది. రైలు మారారు. గుంటూరు స్టేషన్‌లో దిగారు. ఒకరికొకరు నమస్క రించుకుని ఏమీ జరుగనట్లుగా, ఎవరి రిక్షాలు వారెక్కారు. రిక్షా ఛీలేటప్పుడు "సాయంత్రం ఆరుగంటలకు – అయిదు నిమిషాలుమాత్రం" అని అన్నాడు కైలాసం.

ఎన్నిపనులున్నా మానుకుని, తాను ఊళ్లో వున్నప్పుడు, టంచన్‌గా ఆవేళకు రాజ్యం మేడమీద నిలబడేది. కరెక్టుగా అదేవేళకు తాను ఊళ్లో ఉన్నప్పుడు వీధి వెంట వెళ్లేవాడు కైలాసం. "ప్రాణే శ్వరి" అనే గ్రంథమే వ్రాశాడు ఆ ప్రచోదనతో. ఎన్నో రచనలు చేశాడు. గుంటూరులో అతడు పాల్గొనే సాహిత్య

సభలకు విధిగా రాజ్యం హాజరయేది. ఆమె ఉన్న సభలో ఉపన్యసించే టప్పుడు మదగజంవలె విజృంభించేవాడు కైలాసం. ఉత్సాహంతో ఎన్నో చమత్కారాలు శృంగారపరంగా విసిరే వాడు. సభానంతరం ఆమె వున్న ప్రక్కకువెళ్ళి ఆమె ప్రక్కనున్నఎరిగిన వాళ్ళను, "వచ్చారా, చాలా సంతోషం" అని పలుకరించేవాడు. ఆ పలకరింపు తనను గూర్చి అని అర్థంచేసుకున్న రాజ్యం మందహాసం చిలుకరించి, సెలవన్నట్లుగా అతడు చూస్తూ వుండగా నిష్క్రమించేది.

రెండు దశాబ్దా లావిధంగా గడచి పోయినై. హఠాత్తుగా ఒకరోజున కైలాసం కన్నుమూశాడు. ఊరంతా గుప్పుమని, రాజ్యందాకా యీ వార్త వచ్చింది. వింటూనే విసురుగా వాళ్ళ యింటికి వెళ్ళిపోయి అతనిని కడసారిగా చూసి కన్నీరు కార్చింది. ఎంతోమంది అతనిని చూడడానికి వచ్చారు. వారిని తప్పించుకు బయటపడి తన యింటికి వచ్చేసింది. రోజూ అతనికి దర్శనం ఇచ్చే ప్రదేశంలో నిలబడింది. ఆలోచ నలు పరంపరగా వస్తున్నై. తాను తలుపు తెరుచుకుని రైలుపెట్టెలో ప్రవేశించినది మొదలు ఆ ఘట్టమంతా ఒకసారి సినీమా ఆడినట్లు కళ్ళకు కట్టింది.

'మార్గం మంచిదికాకపోయినా అతని చిత్తశుద్ధినిమాత్రం శంకించడానికి వీలు లేదు. స్త్రీపట్ల గౌరవాన్ని ప్రదర్శించే వాడు. ఏ స్త్రీ ప్రేయసి అవుతుందో, అది ఆరాధ్యదేవత కూడా అవుతుందని అతని విశ్వాసం. సౌందర్యోపాసన అనే పేరుతో రెండు దశాబ్దాలు నిత్యం నా దర్శనం చేసుకుని వెళ్ళాడు. కాలాన్ని బట్టి సౌందర్యం తగ్గిపోయినా అతడు రెండు దశాబ్దాలనాటి విగ్రహాన్నే మనస్సులో నిలుపుకున్నాడు. ఆ భ్రాంతి వదలి సత్యం, శివం, సుందరం అయిన దానిని ఆరాధిస్తే ఎంత బాగుండేది ! దేవాలయానికి వెడితే ఎంత బాగుండేది ! తాను ఆత్మహత్య చేసుకోవడానికి పాల్పడ్డాడే కాని, స్త్రీపై అత్యాచారానికి పాల్పడలేదు. విధించిన నియమాలు పాలించి నా పట్ల జాగ్రత్తగానే మెలి గాడు. ఇరవై ఏళ్ళుగా ఈ ప్రదేశంలో అతనిమీద జాలిచేత నేను నిలబడ్డాను. ఈనాటినుండి అతడు రాడు. నేను నిల బడనక్కరలేదు' అని అనుకుంటున్న రాజ్యానికి దుఃఖం పొంగివచ్చింది. నిగ్రహించుకోవాలని ప్రయత్నం చేస్తోంది. ఆ ప్రదేశంలో నిలబడితే ఈ దుఃఖం ఆగేటట్టుగా లేదు. అక్కడ నుండి కదలడానికి తనకు కాళ్ళాడడం లేదు.

ఇంతలో ఆ వీధిలోనుండే కైలాసం శవం ఊరేగింపుగా స్మశానానికి వెడు తోంది. 'కైలాసంగారూ ! వాహ్యాళికి

వెళ్లే ఈ దారినే, స్మశానానికి అంతిమయాత్ర సాగిస్తున్నారా ?' అని బావురుమంటూ చేతులు జోడించి, అక్కడ నిలవలేక తన గదిలోకి వెళ్ళిపోయింది. తలుపులు బిడాయించుకుని వెక్కి వెక్కి యేడ్చింది. కాటుక చెరిగిపోయింది. మంచానికి చేతులు కొట్టుకోవడంతో గాజులు బ్రద్దలయినై. కొంతసేపటికి అలసట వచ్చింది. లేచి ముఖం కడుక్కుని, గాజుముక్కలు ఏరి పారవేసింది. తానెప్పుడో విధవ అయితే ఇంతకాలం తాను వీటిని ఎందుకు వుంచుకుంది ? ఆనాడు ఇవికూడా లేకుండా వుంటే, కైలాసం ఆకర్షింపబడేవాడు కాదేమో !

ఆమెకు అనేక ఆలోచనలు వచ్చినై. "ఇంతకాలం అతని కోరికపై నేను ఒక నిర్దిష్ట ప్రదేశంలో నిలబడ్డానంటే అతనిపై జాలిచేతనేనా? ఇప్పటికీ అంతేనని నేను అనుకుంటున్నాను. సహజంగా మరణించిన అతనికోసం నేను ఇంతగా దుఃఖించవలసిన అవసరం ఏమున్నది ? అందరి మోస్తరుగా లోకసామాన్యంగానే విచారించవచ్చుకదా ! ఈ వింత అనుబంధం అసలు ఎందు కేర్పడింది ? ఆనాడు నాకు అతనిపై నాకు తెలియకుండానే అంతరాంతరాల్లో ప్రేమ వున్నదని, కైలాసం అన్నమాటలలో ఏమయినా నిజం వున్నదా ? ఏమయినా అల్ప దౌర్బల్యం నాలో కూడా వున్నదా ? ఇంతకీ అతడెవరు ? నేనెవరు ?"

రాజ్యం ఒక వెర్రి నవ్వు నవ్వింది. కైలాసం దహనం పూర్తిచేసి వారింటికి వెడుతున్నారనే మాటలు బయటనుండి వినబడుతున్నై. ఎవరికి ఎవ్వరూ ఏమీ కారు — అని అనుకుంది. తలుపును గట్టిగా ఎవ్వరో తట్టినట్లయింది. తూలుతూ వెళ్ళి తలుపులు తెరచింది.

"కేంద్ర సాహిత్య అకాడమీవారు, కైలాసంగారి 'ప్రాణేశ్వరి'కి అయిదు వేల రూపాయలు అవార్డు ఇచ్చారు. ఈ వార్తా, ఆయన మరణవార్తా, రెండూ ఇవాళ పత్రికలో వచ్చినై" అన్నాడు రాజ్యంతో ఆమె తమ్ముడు. ఆమె నిర్వికారంగా వుండిపోయింది — ప్రాణేశ్వరిలో పద్యాలు అతడు చదవడం మాత్రం విన్పిస్తోంది.

